క్లుప్తంగా

శ్మశానవాటికను పరిశీలించిన మంత్రి

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తంలోని శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని గ్రామస్తులు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి మంగళవారం శ్మశానవాటికను స్వయంగా పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారుల్ని ఆదేశించడమే కాకుండా శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. మంత్రి వెంట సర్పంచ్ కడిమి చిన్నవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు, మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

అనధికార ఆక్వాసాగుపై అధికారుల విచారణ

తాళ్లరేవు: పాతకోరంగి గ్రామంలో వ్యవసాయ భూముల్లో సాగుతున్న అనధికారిక ఆక్వాసాగుపై రెవెన్యూ, మత్స్యశాఖ, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారుల బృందం మంగళవారం విచారణ చేపట్టారు. అక్రమాలపై పలువురు లోకాయుక్తకు ఫిర్యాదుచేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు బృంద సభ్యులు ఆక్వా చెరువులు, వ్యవసాయ భూములను పరిశీలించి రైతులను విచారించారు. ఈ సందర్భంగా కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ మాట్లాడుతూ ఆక్వా, వ్యవసాయ సాగుకు సంబంధించి రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిశీలించి నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో మత్స్యశాఖ డీడీ ఇంచార్జ్ శ్రావణి, ఏడీ కరుణాకరరావు, ఏఓ ప్రశాంతి, తహసీల్దార్ ఎస్.పోతురాజు పాల్గొన్నారు.

అమలాపురంలో ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: విశ్వ బ్రాహ్మణ యువత ఆధ్వర్యంలో స్థానిక సుధీర్ ఆస్పత్రి వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ వై.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పేదలకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ యువత ప్రతినిధులు కోసూరి చిదంబరాచారి, బొల్లోజు శ్రీకాంత్, కట్టోజు సన్నయ్యదాసు, అవుపాటి వేణుగోపాల్, చెట్రోలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: అమృత్ సరోవర్ అనే పథకం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న చెరువుల పనులను డ్వామా పీడీ కె.మధుసూదన్ పరిశీలించారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో చెరువుల వద్ద నీటిని తోడుతున్న పనుల్ని మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో రాజామణి, టీఏలు నానిబాబు, దేవి, నాగు ఉన్నారు.

విధిరాతను ఎదిరించి.. విజయాన్ని సాధించి..

- మహిళల్లో స్ఫూర్తి నింపుతున్న తోట భవానీ పోరాట గాథ
- భర్త చనిపోయినా కుంగిపోకుండా ముందడుగు
- మగ్గం వర్క్‌తో అంచెలంచెలుగా ఎదిగి పలువురికి ఉపాధి



మగ్గం వర్క్స్ డిజైన్‌లను పర్యవేక్షిస్తున్న తోట భవానీ

యానాం: సాఫీగా సాగిపోతున్న జీవితం.. భర్త మరణంతో ఒక్కసారిగా తలకిందులైంది. ఓర్చుకోలేనంత బాధ ఆమెను చుట్టుముట్టింది.

మానసికంగా కుంగిపోయింది. అయినా ఎవరిపై ఆధారపడకుండా తన కాళ్లపై తాను నిలబడాలని నిర్ణయించుకుంది. ఒడిలో ఉన్న తన ఇద్దరు చిన్నారుల్ని పోషించుకోవడానికి జీవనపోరాటం మొదలుపెట్టింది. తనకొచ్చిన చేతివృత్తినే ఆధారంగా చేసుకుని అంచెలంచెలుగా ఎదిగింది. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించుకోవడమే కాకుండా 14 మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంది. ఆమే యానాంకు చెందిన తోట భవానీ.. మహిళల్లో స్ఫూర్తినింపుతున్న ఆమె పోరాట గాథపై మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

పెదపూడి మండలం కాండ్రేగులకు చెందిన తోట భవానీ బీఈడీ వరకూ చదువుకున్నారు. 2004లో ఆమెకు యానాంకు చెందిన విజయ్‌కుమార్‌తో పెళ్లైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. అయితే 2009లో యానాం–కాకినాడ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త విజయ్‌కుమార్ మృతి చెందారు. దీంతో ఆమె జీవితంలో చిమ్మచీకటి నెలకొంది. మరోవైపు పిల్లల భవిష్యత్‌పై ఆందోళన మొదలైంది. దీంతో నెమ్మదిగా మనసు కుదుటపరచుకుని ముందుకు సాగాలని నిర్ణయించుకుంది. ముందుగా స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరి కొంతకాలం పనిచేసింది. వచ్చే జీతం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది. దీంతో తాను పెళ్లి కాక ముందు నేర్చుకున్న టైలరింగ్‌ని వృత్తిగా చేపట్టి స్వయం ఉపాధిని ఏర్పరచుకుంది.

ఆదుకున్న చేతి వృత్తి

ముందులో చిన్నగా టైలరింగ్ ప్రారంభించి వారికి నచ్చిన విధంగా బట్టలు కుడుతూ స్థానికుల మన్ననలు పొందింది. అలా స్వయం ఉపాధి ద్వారా వస్తున్న సొమ్ముతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లల్ని బాగా చదివించుకుంది. క్రాఫ్ట్ అండ్ ఆర్ట్స్ సర్టిఫికెట్ కోర్సు సైతం చేసి ఉండడంతో తానే సొంతంగా బట్టలపై డిజైన్లు వేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనతో ముందడుగేసింది. అలా 2017లో విజయ సాయి డిజైన్స్ అనే సంస్థను ప్రారంభించి అధిక డిమాండ్ ఉన్న మగ్గం వర్క్ మొదలుపెట్టింది. మగ్గంపై పెళ్లిళ్లకు వస్త్రాలపై వివిధ రకాలైన బొటిక్ వర్క్ డిజైన్‌లు వేయడం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీతో వినియోగదారులకు అందిస్తోంది. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. ఇద్దరు కార్మికులతో మొదలైన ఆ సంస్థను నేడు ఏకంగా 14 మందికి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకొచ్చింది. అంతటితో ఆగకుండా యానాంలో ఉన్న సంస్థతో పాటు కాకినాడలో మరో బ్రాంచ్‌ను స్థాపించి అక్కడా మరికొందరికి ఉపాధి కల్పిస్తోంది. ప్రస్తుతం భవానీ పిల్లలు లావణ్య, ప్రవల్లిక పెద్దవారై ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూనే తల్లికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. భవానీ ఒకపక్క తన సంస్థను నడుపుతూనే మహిళలకు మగ్గం వర్క్ నేర్పిస్తోంది. తన సంస్థ ద్వారా అనాథాశ్రయాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ మహిళలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

ఏదొక వృత్తిలో నైపుణ్యముండాలి



నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పుడు మొదట్లో మానసికంగా కుంగిపోయాను. తరువాత పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి టైలరింగ్, మగ్గం వర్క్ ప్రారంభించాను. పెళ్లి కాక ముందు నేను నేర్చుకున్న చేతివృత్తులే నాకు దారి చూపించాయి. మహిళలందరూ తమకు నచ్చిన ఏదొక వృత్తిలో నైపుణ్యం సాధించడం మంచిదనిపిస్తుంది.

– తోట భవానీ, విజయసాయి డిజైన్స్ సంస్థ యజమాని, యానాం

గృహ సారథులు, కన్వీనర్లది గురుతర బాధ్యత

- ప్రజలతో మమేకమై సంక్షేమంపై అవగాహన పెంచాలి
- కన్వీనర్‌లు, గృహ సారథులకు మంత్రి విశ్వరూప్ దిశానిర్దేశం



గొల్లవిల్లి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: గృహ సారథులు, కన్వీనర్లు గురుతర బాధ్యత వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో గొల్లవిల్లి గ్రామంలో కల్యాణ మండపంలో మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఒక్కో వలంటీర్‌కు ఇద్దరు చొప్పున గృహసారథులను, సచివాలయానికి ముగ్గురు కన్వీనర్‌లను ఏర్పాటుచేశామని చెప్పారు. గృహ సారథులు, కన్వీనర్లు బాధ్యతగా పని చేసి మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వారందరికీ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన వీడియోను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వలంటీర్ల ద్వారా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మోటూరి సాయి, మానే శ్రీను, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్‌ఖాదర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాస్, దంగేటి రాంబాబు, మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

అల్లవరం: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి ఫంక్షన్ హాల్లో గృహసారథులు, సచివాలయ కనీనర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గృహ సారథులు మార్చి 18 నుంచి వలంటీర్లతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన పనితీరుని వివరించాలన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు అందించిన సంక్షేమ పథకాల్లో వ్యత్యాసాలను లబ్ధిదారులకు తెలియజేయాలని చెప్పారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా గృహ సారథులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గృహ సారథులుగా నియమితులైన వారికి ఉచిత బీమా సౌకర్యం, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని మంత్రి విశ్వరూప్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, టౌన్ అధ్యక్షులు సంసాని నాని, మండల కన్వీనర్ తిక్కా ప్రసాదు, పినిపే శ్రీకాంత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముసుగులు తొలగించాలి

ఐ.పోలవరం: జి.వేమవరం జెడ్పీ పాఠశాల ఆవరణలో బీఆర్ అంబేడ్కర్, గాంధీ విగ్రహాలను 2009 నుంచి ముసుగు వేసి ఉంచారని, ఇప్పటికైనా ముసుగులు తొలగించాలని గ్రామానికి చెందిన కె.చినబాబు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు మంగళవారం విన్నవించారు. దీనిపై గతంలో అనేకసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

అల్లవరం: గంజాయి తాగుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారని అల్లవరం ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు. అల్లవరం శ్మశానవాటిక వద్ద వీరిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి సుమారు 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యువత గంజాయికి బానిస అవుతున్నారని, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిఘా ఉంచాలని ఎస్‌ఐ తెలిపారు.

ది అమలాపురం చాంబర్ అధ్యక్షుడిగా సత్తిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ నూతన అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం టౌన్: ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా బోణం సత్యవరప్రసాద్(సత్తిబాబు) ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక బంగారు వెండి వర్తక సంఘ భవనంలో వ్యాపార సంఘాల ప్రతినిధుల సమావేశంలో చాంబర్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చాంబర్ గౌరవాధ్యక్షుడిగా అల్లాడ స్వామినాయుడు, కార్యదర్శిగా కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారిగా దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షులుగా చిట్టూరి పెదబాబు, రేపాక సూర్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, చాంబర్ మాజీ అధ్యక్షుడు గోకరకొండ హరిబాబు, మెట్ల రమణబాబు, బీవీసీ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవన నిర్మాణం కోసం నూతన అధ్యక్షుడు సత్తిబాబు రూ.5 లక్షలు, చాంబర్ ఉపాధ్యక్షుడు సాయిబాబు రూ.లక్ష, నల్లా మల్లిబాబు రూ.లక్ష విరాళంగా ప్రకటించారు.

డాక్టర్ విజయ సేవలు మరువలేం



డాక్టర్ విజయను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ మహిళా ప్రతినిధులు

అమలాపురం టౌన్: కరోనా విజృంభన సమయంలో అమలాపురం మున్సిపల్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ కుడుపూడి విజయ రోగులకు అందించిన విస్తృత సేవలను పట్టణ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని జైవాసవీ క్లబ్ గోల్డెన్ వనిత వైస్ గవర్నర్ యెండూరి సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ నూలు వరలక్ష్మి, క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ యెండూరి రాఘవ, క్లబ్ జోన్ చైర్‌పర్సన్ చెక్కా రాణి, రీజియన్ సెక్రటరీ బోనగిరి సత్య పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలల్లో ముందున్నారని జిల్లా ఇంచార్జి లేబర్ కమిషనర్ టి.నాగలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామారావు, ఏవో జక్కం కృష్ణారావు, మేడిచర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఐ.పోలవరం: పాఠశాలలో చదివే పిల్లలందరూ మధ్యాహ్న భోజనం తినేలా తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సూచించారు. మండలంలో మంగళవారం ఆమె ఐ.పోలవరం జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌ల్ని ఎలా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థుల్ని ఇటీవల నిర్వహించిన రివిజన్ టెస్టులు, నోట్స్‌పై ప్రశ్నలడిగారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై సమీక్షించారు. డీఈవో వెంట మధ్యాహ్న భోజన పథకం ఏడీ సురేష్, మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరావు తదితరులున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

అల్లవరం: ఓడలరేవులో ఓఎన్‌జీసీ టెర్మినల్ నిర్మాణం, ప్రహారీ గోడ ఏర్పాటుతో వందలాది ఎకరాల కొబ్బరి, సరుగుడు తోటలు ముంపు బారినపడి చనిపోతున్నాయని స్థానికులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో వారి ఆదేశాల మేరకు డ్రెయిన్స్ అధికారులు టెర్మినల్ ముందు ముంపులో ఉన్న కొబ్బరి, సరుగుడు తోటలను మంగళవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్ డీఈ కిషోర్ మాట్లాడుతూ ముంపు నీరు దిగేందుకు డ్రెయిన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని గ్రామస్తులు తెలిపారు. ఆయన వెంట ఏఈ సునీత, చొల్లంగి రాధాకృష్ణ ఉన్నారు.

ఘనంగా స్వామివారి చక్రస్నానం

యానాం: భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా 15వ రోజు మంగళవారం నిర్వహించిన చక్ర స్నానం వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌతమీ గోదావరిలో చక్రస్నానానికి ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం తదితరులు హాజరయ్యారు. తెప్పతెన్నాల ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మద్దింశెట్టి సత్తిరాజు, డాక్టర్ ఎంవీఎస్ ప్రసాద్ కుమారులు, మనుమలు ఉత్సవదారులుగా నిర్వహించిన చంద్ర వాహనోత్సవం సైతం వైభవంగా జరిగింది.

చక్రతీర్థానికి పోటెత్తిన మహిళలు

స్వామివారి రథోత్సవం తర్వాత అత్యంత వైభవంగా నిర్వహించే చక్రతీర్థానికి యానాం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

డాక్యుమెంటరీ రూపకల్పన

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని కింగ్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు 'ఇట్లు మీ అమ్మ నాన్న' పేరుతో సందేశాత్మక డాక్యుమెంటరీ రూపొందించారు. డాక్యుమెంటరీని స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం విడుదల చేసి, విద్యార్థులను అభినందించారని ఆ కాలేజీ డైరెక్టర్ కె.జగదీష్, ప్రిన్సిపాల్ నామాడి సోమరాజు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు సంపత్, దుర్గా ప్రవీణ్ పాల్గొన్నారు.

కైట్‌లో ఘనంగా ముగిసిన 'శస్త్ర'

తాళ్లరేవు: కోరంగి కైట్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఈవెంట్ శస్త్ర మంగళవారంతో ఘనంగా ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ యేడిద రామకృష్ణ ఆధ్వర్యంలో సైంటిఫిక్ అప్రోచ్ ఫర్ సోషల్ అండ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(శస్త్ర) కార్యక్రమం నిర్వహించారు. చివరిరోజు కార్యక్రమానికి హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్‌లు డా.అనిల్ కుమార్ ఉప్పాల, శత్రుంజయ్ రావత్, చిరంజీవి యత్రా, సచిన్ చౌదరిలు హాజరై విద్యార్థులు ప్రదర్శించిన 17 ప్రాజెక్టులను తిలకించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కైట్ ప్రిన్సిపాల్ దూబే రేవతి, కిరణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమి తిథిని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి మంగళవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, చండీ పారాయణ, చండీ హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.